క్లుప్తంగా

రెండు బైకులు ఢీ ముగ్గురికి గాయాలు



దామెర: రోడ్డు దాటుతున్న బైక్‌ను మరో బైక్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పసరగొండ క్రాస్‌వద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఊరుగొండ గ్రామానికి చెందిన వినయ్, హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామానికి చెందిన సాయిచరణ్ బైక్‌పై పసరగొండ క్రాస్‌వద్ద జాతీయరహదారిపై రోడ్డు క్రాస్ చేస్తున్నారు. ఈ క్రమంలో పరకాలకు చెందిన ఓ వ్యక్తి ఎఫ్‌జెడ్ ద్విచక్రవాహనంతో వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. సాయిచరణ్‌ను అపోలో ఎస్‌ఎస్‌ఆర్ ఆసుపత్రికి, మరొకరిని గార్డియన్, మరొకరికి ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా సాయిచరణ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామానికి చెందిన ఎర్రబెల్లి సుదర్శన్‌రావు (94) బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, బండి సుధాకర్, ప్రముఖ న్యాయవాది నిమ్మాని శేఖర్‌రావు వేర్వేరుగా పరామర్శించారు. మృతదేహానికి నివాళులర్పించారు. వారివెంట పూర్ణచందర్‌రావు, సోమేశ్వర్‌రావు, చందర్‌రావు, శ్రీనివాస్, శ్రీనివాస్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆత్మకూరు : మండల కేంద్రానికి చెందిన నాగపురి మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో దుర్మరణంచెందాడు. అతనితోపాటు 1991 సంవత్సరంలో ఆత్మకూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుకున్న పూర్వవిద్యార్థిలు మహేష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.30 వేలు ఆర్థికసాయం అందించారు. మిత్రులు సతీష్, వాసు, పాపని రవీందర్, మూల ప్రవీణ్, సుగ్రీవుడు, వెంకట్‌రెడ్డి, పరమేశ్వర్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పరకాల : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని దామెర ఏఎస్సై ఇనుగాల రాజురెడ్డి అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గత నెల రోజులుగా జరుగుతున్న ఉచిత సమ్మర్ క్రికెట్ క్యాంప్‌లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు, అవార్డులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని అన్నారు. క్రీడల్లోనే పోటీ పడాలని, వ్యక్తిగతంగా కలిసి మెలసి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్లేయర్ అవార్డు గంద్ర సాయి ఈశ్వర్ సాధించగా ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా అల్లం రణధీర్, బౌలర్‌గా నవదీప్ అవార్డులను అందుకున్నారు. దామెర గ్రామానికి చెందిన ఓ క్రికెట్ క్రీడాకారుడు రూ.5వేల విలువ చేసే క్రికెట్ బ్యాట్‌ను ఉత్తమ క్రీడాకారుడికి అందించారు. క్రికెట్ క్రీడాకారులకు టిఫిన్స్, అరటిపండ్లు, కోడిగుడ్లు అందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ బొజ్జం అరుణ్, సమృద్, చింటూ , ఆదర్శ్, తులసి, ఆలేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్వేతార్కలో కల్యాణం

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలోని సిద్ధి, బుద్ధి సమేత గణనాథుడికి పండితులు వివాహ వేడుకలు జరిపించారు. వసంతోత్సవ వేడుకల్లో భాగంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో అర్చకులు, పండితులు బుధవారం కల్యాణం నిర్వహించారు. వధూవరుల పక్షాన రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణశర్మ నిలిచి వివాహం జరిపించి భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, రమ దంపతులతో పాటు రాజిరెడ్డి, వెంకటేశ్వర్లు శర్మ, మణిదీప్, రవి, సుధీర్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామంలో రాధాకృష్ణుల దేవాలయంలో 10వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి అయినవోలు సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో రాధాకృష్ణుల విగ్రహాలకు అర్చనలు, అభిషేకాలతో పాటు ప్రత్యేక అలంకరణ పూజలు జరిపించారు. శ్వేతార్క ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణ శర్మ భక్తులతో గణపతి హోమం చేయించారు.

ప్రమాదకరంగా లోలెవల్ వంతెన

- వర్షాకాలం వస్తే రాకపోకలు బంద్
- నిధులు మంజూరైనా పూర్తికాని టెండర్ల ప్రక్రియ
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



గొల్లపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)



ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీటిలో నుంచి వస్తున్న వాహనదారులు (ఫైల్)

నడికూడ : వర్షాకాలం వచ్చిందంటే మండల కేంద్రంలోని గొల్లపల్లి లోలెవల్ వంతెన వద్ద వాహనాలు ఒక్కోటిగా నిలిచిపోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. వెంకటయ్య చెరువు మత్తడి పోస్తే వాహదారులు అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు. వెంకటయ్య చెరువు నీరు నిత్యం పారడంతో రొడ్డాంపై పాకురు ఏర్పడి జారుడుబండలా మారుతుంది. దిచక్రవాహనదారులు కిందపడి గాయాలపాలైన సందర్భాలు ఉన్నాయి.

వర్షాకాలం రాకపోకలు బంద్

వర్షాకాలం వస్తేచాలు వరదనీరు ఉధృతితో నడికూడ-గొల్లపల్లి .మధ్య వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. మండల కేంద్రం నుంచి వరంగల్, హనుమకొండకు వెళ్లాలంటే సుమారు 14 కిలో మీటర్లు అధనంగా ప్రయాణించాల్సి వస్తోంది. వారంరోజులు వరకు వరద నీరు ప్రవహిస్తే రాకపోకలు పూర్తిగా నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. గొల్లపల్లి, ధర్మారం గ్రామస్తులకు నిత్యావసర సరుకులతో పాటు, తాగునీరు కూడా మండల కేంద్రం నుంచి తీసుకెళ్తుంటారు. ఈ రొడ్డాంపై వెళ్తున్న వాహనాలు వరద ఉధృతికి కొట్టుకుపోయిన సందర్భాలు ఉన్నాయి.

వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు

రూ 2.కోట్ల70 లక్షల వ్యయంతో రొడ్డాంపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు చేయగా నిధులు సైతం మంజూరు అయ్యాయి. కానీ ఇప్పటివరకు టెండర్ల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఈ ఏడాది వర్షాకాలంలోపు వంతెన నిర్మాణ పనులు చేపట్టి తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

పాకురు పేరుకుపోతోంది



వర్షాకాలంతో పాటు వరద నీరు నిత్యం పారడంతో లోలెవల్ వంతెనపై పాకురు పేరుకుపోతోంది. దాంతో ద్విచక్రవాహనంతో వెళ్లాలంటేనే భయమేస్తుంది. మండల కేంద్రానికి వివిధ పనుల కోసం వెళ్లే ప్రజలు, పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెన లేకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. ఈ వర్షాకాలంలోపు వంతెన నిర్మాణ పనులు చేపట్టి త్వరగా పూర్తి చేయాలి.

– జీల శ్రీనివాస్‌యాదవ్, గొల్లపల్లి

టెండర్ల ప్రక్రియ చేపట్టాలి



నడికూడ-గొల్లపల్లి మధ్య ఉన్న రొడ్డాంపై వంతెన నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లా. దీంతో అప్పటి ప్రభుత్వం రూ 2.కోట్ల70 లక్షల అంచనా వ్యయంతో నిధులు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ జరగకపోవడంతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ప్రభుత్వం, అధికారులు స్పందించి టెండర్ల ప్రక్రియను చేపట్టి పనులు ప్రారంభించాలి.

– ఊర రవీందర్‌రావు, మాజీ సర్పంచ్

20వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కమలాపూర్ : మండలంలోని విద్యుత్ తీగలకింద చెట్టు కొమ్మలు తొలగించేందుకు గురువారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. గురువారం దేశరాజుపల్లి, శనిగరం రూరల్, 17న గూడూరు, శ్రీరాములపల్లి, 18న వంగపల్లి, మాదన్నపేట, 19న కమలాపూర్ టౌన్, శ్రీరాములపల్లి ఎక్స్‌ప్రెస్, 20న శనిగరం ఎక్స్‌ప్రెస్, కమలాపూర్ ఎక్స్‌ప్రెస్ ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడనుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

దామెరలో..

దామెర : మండలంలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ గుర్రం రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పసరగొండ 11కేవీ ఫీడర్‌కు సంబంధించిన విద్యుత్ వైర్లకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడం, కరెంటు తీగల మరమ్మతులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పసరగొండ, పులుకుర్తి, ఊరుగొండ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పరకాలలో..

పరకాల : పట్టణంలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సత్యనారాయణ బుధవారం ప్రకటనలో తెలిపారు. 11 కేవీ వన్ ఫీడర్ విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా చెట్ల కొమ్మలు తొలగించేందుకు ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు సాయిబాబా గుడి, హెచ్‌పీ పెట్రోల్‌బంక్, వ్యవసాయ మార్కెట్, అంబేడ్కర్ సెంటర్, కూరగాయల మార్కెట్, బొడ్రాయి, మేదరివాడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండలంలోని మల్కపేట ఫీడర్ పరిధిలో గురువారం మరమ్మతులు కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు మండలంలోని కొత్తగట్టు, మల్కపేట, తిరుమలగిరి గ్రామాలకు విద్యుత్ సేవలకు అంతరాయం కలుగనుందని తెలిపారు.

ఐనవోలులో..

ఐనవోలు : ఐనవోలు, కొండపర్తి సబ్‌స్టేషన్ ఒంటిమామిడిపల్లి, ముల్కలగూడెం, వెంకటాపూర్ ఫీడర్ల పరిధిలో చెట్టుకొమ్మల కత్తిరింపు, లైన్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఇన్‌చార్జ్ ఏఈ శివకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఒంటిమామిడిపల్లి గ్రామవ్యవసాయ బావులకు, ముల్కలగూడెం, నర్సింహులగూడెం, వెంకటాపూర్ గ్రామ ఇండ్ల, వ్యవసాయబావులకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు.

నూతన పీఆర్‌సీని అమలు చేయాలి



హన్మకొండ: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నూతన వేతన సవరణను అమలు చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని సంఘం కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023, జూలై 1 నుంచి నూతన పీఆర్‌సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం చెల్లించాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీఆర్‌ఎస్ కమిటీ రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను ఆహ్వానించడం సంతోషకరమన్నారు. ఇది చర్చల వరకే పరిమితం కాకుండా త్వరగా ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని కోరారు. పీఆర్టీయూ జయశంకర్ జిల్లా అధ్యక్షుడు రాచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పసుల శంకర్ మాట్లాడుతూ ఈ వేసవిలోనే ఉద్యోగ, ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని, ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి, ఇది ఉద్యోగుల ప్రభుత్వం అని రుజువు చేసుకోవాలని అన్నారు. పీఆర్టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పున్నంచందర్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వల్లభోజు సుధాకర్, రాష్ట్ర నాయకుడు బోడ రాంజీ పాల్గొన్నారు.

రైల్వే సంఘ్ డిప్యూటీ సెక్రటరీగా మురళి



మురళిని సన్మానిస్తున్న నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేటకు చెందిన రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకుడు చింత మురళికి సికింద్రాబాద్ డివిజన్ కమిటీలో కీలక పదవి లభించిందని రైల్వే సంఘ్ నాయకులు బుధవారం తెలిపారు. సికింద్రాబాద్‌లో జరిగిన సంఘ్ వర్కింగ్ కమిటీ సమావేశంలో మురళికి ఈ అవకాశాన్ని డివిజన్ నాయకులు కల్పించారు. కాజీపేట మెయిల్ ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్‌గా పనిచేస్తూ సంఘ్ సీడబ్ల్యూసీ సభ్యుడిగా ఉన్న చింత మురళిని సికింద్రాబాద్ డిప్యూటీ డివిజన్ సెక్రటరీగా నియమించినట్లు వివరించారు. ఈ మేరకు రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయంలో ఆయనను బుధవారం రాత్రి రైల్వే సంఘ్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో రైల్వే సంఘ్ నాయకులు సాధినేని వెంకటనారాయణ, కె.రవి, పాక రాజ్‌కుమార్, నర్సింగరావు, బల్వీందర్ సింగ్, బి.మాధవరావు, జగదీశ్వర్, మధుసూదన్‌రావు, అభిలాష్, కాంగ్రెస్ నాయకుడు ఎం.డి.అంకూస్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అభినందన



హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ నేతృత్వంలో జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగిన సందర్భంగా సిక్తా పట్నాయక్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘ నాయకులు లక్ష్మీప్రసాద్, జిల్లా నాయకులు భరత్, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో మెగా రక్తదాన శిబిరం




ప్రశంస పత్రాలు అందజేస్తున్న ప్రతినిధులు

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో వాగ్బాట యోగా అండ్ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెరుమాండ్ల మధుసూదన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంస్థ హనుకొండ నేతృత్వంలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పెసరు నిరంజన్ రెడ్డి హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల సహాయార్థం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. రక్తదాతల నుంచి 56 యూనిట్ల రక్తాన్ని రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సేకరించారు. కార్యక్రమంలో వాగ్బాట, వాకర్స్ ప్రతినిధులు రాంచందర్, శ్రీశైలం, సాంబయ్య, సుభాష్, నవీన్‌రెడ్డి, రాంబాబు, కన్నయ్య, మోహన్, గోపాల్, వేణు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు అవగాహన కల్పించాలి

కాజీపేట: చిన్న పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులను ఎదురించేలా వారికి అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని తల్లిదండ్రులు గుర్తించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో సఖి వన్‌స్టాప్ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మహిళా అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పిల్లల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన చట్టం ప్రివెన్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ యాక్ట్ గురించి వివరించారు. ఈ సమావేశంలో వినీల, స్వర్ణలత, సునీత దేవి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేయిస్తున్న అశోక్ ఆర్య

ఖిలా వరంగల్: యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని యోగా గురువు అశోక్ ఆర్య అన్నారు. బాల సంస్కార్ -2024 కార్యక్రమంలో భాగంగా వరంగల్ శంభునిపేటలోని హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో హనుమాన్ సేవాసమితి ఆధ్వర్యంలో యోగా, భారతీయ కళలు, ఆచారాలపై బుధవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై బాలలకు యోగా ఆసనాలు నేర్పించారు. ఈ సందర్భంగా అశోక్ ఆర్య మాట్లాడుతూ సేవా సమితి ఏర్పాటు చేసిన యోగా శిక్షణను బాలబాలికల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యోగాతో ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని వివరించారు. దయాకర్, శ్రీరామ్, శరత్‌బాబు పాల్గొన్నారు.

బెదిరించిన కేసులో విచారణ

ఖిలా వరంగల్: అర్ధరాత్రి రోడ్డుపై కారు పార్కు చేసి అటువైపుగా వెళ్తున్న ఓ జర్నలిస్టును యువత బెదిరింపులకు పాల్పడిన కేసులో పోలీసులు విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. కారుపై కార్పొరేటర్ లెబుల్ స్టిక్కర్ వేసి పోలీస్ హారన్ మోతతో అర్ధరాత్రి అంతర్గత కాలనీల్లో తిష్టవేసి హల్‌చల్ చేసిన నలుగురు యువకులను మంగళవారం గుర్తుంచి అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. వారిని వాకి తల్లిదండ్రుల సమీక్షంలో ఇన్‌స్పెక్టర్ మల్లయ్య కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం. అంతముందు మామునూరు గ్రామంలో కార్పొరేటర్ ఇంటి ముంగిట్లో పార్కు చేసి కనిపించిన కారును మిల్స్‌కాలనీ స్టేషన్‌కు తరలించి ఆ కారుపై గతంలో ఏమైన కేసులు ఉన్నాయా..? ఉంటే వాటి వివరాలు ఏంటి.. ఆ కారు ఎవరిది అనే కోణంలో విచారణ చేసి వివరాలు సేకరించినట్లు విశ్వసనీయ సమాచారం.

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

దామెర : మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల పెంపకంపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ కల్పన సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను సిద్ధం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ శారద, ఫీల్డ్ అసిస్టెంట్లు, వనసేవకులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ కల్పన

గడువులోగా యూనిఫాం అందించాలి



శాయంపేట : క్లాత్ అందజేస్తున్న ఎంపీడీఓ



ఆత్మకూరులో..

శాయంపేట : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం నుంచి సరఫరా అయిన యూనిఫాంలను గడవులోగా అందించాలని ఎంపీడీఓ ఫణిచంద్ర, నోడల్ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో డ్వాక్రా మహిళలకు యూనిఫాంక్లాత్ అందించారు. పాఠశాల పునఃప్రారంభ గడువులోగా విద్యార్థులకు యూనిఫాం కుట్టి ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన యూనిఫాం కుట్టుక్లాత్‌ను బుధవారం మహిళా సమాఖ్య సభ్యులకు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అందించారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోపు యూనిఫాంను కుట్టి విద్యార్థులకు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సరైన కొలతలతో దుస్తులు కుట్టి ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం లలితాదేవి, ఎంఈఓ రమాదేవి, మండల ప్రత్యేకాధికారి తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి



సరోజన ఇంటిని పరిశీలిస్తున్న సుమన్

శాయంపేట : ఇటీవల కురిసిన అకాల వర్షం, ఈదురు గాలుల బీభత్సానికి ఇంటి పైకప్పు రేకులు కొట్టుకుపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ కోరారు. ఈ మేరకు బాధితులు గజ్జి సరోజన, సరిత ఇళ్లను పరిశీలించి పరామర్శించారు. అకాల వర్షంతో నష్టపోయిన నిరుపేద కుటుంబాల స్థితిగతులపై రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించాలని అన్నారు. నష్టపోయిన ప్రతి రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వ పరంగా తక్షణ ఆర్థిక సాయం అందించాలని కోరారు.

ఆలయంలో వసతులు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న భక్తులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో కనీస వసతులు కల్పించాలని భక్తులు, గ్రామస్తులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ, గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి గుండె బాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భక్తులు, ఆంజనేయస్వామి దీక్షాపరులు మాట్లాడుతూ .. భక్తాంజనేయస్వామి ఆలయంలో కనీస సౌకర్యాలు లేక భక్తులు, ఆంజనేయస్వామి దీక్షాపరులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రతి సంవత్సరం సుమారు 150 మంది భక్తులు హనుమాన్ దీక్ష స్వీకరించి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని, దీక్షలోఉన్న స్వాములను, భక్తులను నీటి సమస్య వేధిస్తోందని అన్నారు. ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత కరువైందని, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. అధ్యాత్మిక భావనతో హనుమాన్ దీక్ష చేపట్టి పూజలు నిర్వహిస్తున్న దీక్షాపరులకు, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. భక్తాంజనేయస్వామి దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేశాం

- పెండింగ్ బిల్లులు ఇచ్చి ఆదుకోవాలి
- మాజీ సర్పంచ్ వేడుకోలు

నడికూడ : గ్రామాభివృద్ధి కోసం గత ప్రభుత్వం అప్పగించిన అభివృద్ధి పనులను అప్పులు తెచ్చి పూర్తి చేశానని, ఇప్పటి వరకు బిల్లులు రాలేదని నడికూడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు వాపోయారు. తెచ్చిన అప్పులకు వడ్డీ పెరుగుతోందని పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామం బాగుండాలి, అభివృద్ధి పథంలో నడవాలనే ఉద్దేశంతో విపత్కర పరిస్థితుల్లో కూడా అభివృద్ధి పనులను నిలుపుదల చేయకుండా పూర్తి చేశామన్నారు. గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధికు సంబంధించిన రూ.50 లక్షలు వరకు బిల్లులు చెల్లించలేదని అన్నారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. బిల్లుల చెల్లింపులో జాప్యం కొనసాగితే రానున్న రోజుల్లో పనులు చేసేందుకు ఎవరూ ముందుకురారని తెలిపారు. మాజీ సర్పంచ్‌లకు ఆత్మహత్యలే శరణ్యమని అన్నారు.

సుందరయ్య ఆశయ సాధనకు కృషి



నివాళులర్పిస్తున్న నాయకులు, స్థానికులు

కాజీపేట అర్బన్: కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేద్దామని సీపీఎం నాయకుడు జంపాల మురళి అన్నారు. కాజీపేట మండలం న్యూశాయంపేటలోని కందుల బండ ప్రాంతంలో సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మురళి మాట్లాడుతూ.. సుందరయ్య జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకుని పోరాటాలు చేయాలని సూచించారు. ఆయన పోరాట పటిమను అందరూ తెలుసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జాటోతు విజయ్, సాంబయ్య, రమేష్, మదన్, సురేష్, రాజేశ్వరి, కోమల, కల్పన, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.